
# సాధన

**అరుణ**




**సమయం సాయంత్రం 5 గంటలు.**

**బ్యాంక్‌లో క్లర్క్‌లందరూ పని ముగించుకుని ఇళ్ళకు వెళ్లడానికి ఉద్యుక్తులవుతున్నారు.**

**గాయత్రి కూడా సీటులో నుండి లేచింది. ఆ రోజే కొత్తగా ఉద్యోగంలో చేరిందామె.**

తాళాల గుత్తి తీసుకుని స్ట్రాంగ్ రూమ్‌లోకి వెళుతున్న ఆఫీసర్ విశ్వనాథ్ అప్రయత్నంగా గాయత్రి వైపు చూశాడు.

బొద్దుగా, తెల్లగా, చలాకీగా ఉందామె. నడకకు అనుగుణంగా ఆమె పొడవాటి జడ లయబద్ధంగా కదులుతోంది.

ఉదయం గాయత్రిని చూసినప్పటి నుండీ ఎక్కడో చూసినట్లు అనిపిస్తోందతనికి. కాని ఎక్కడ చూశాడో జ్ఞాపకం రావడం లేదు.

మర్నాడు సేవింగ్స్ బ్యాంక్ కౌంటర్‌లో పనిచేసే క్లర్క్ సెలవు పెట్టడంవల్ల గాయత్రిని ఆ సీటులో వర్క్ చేయమని చెప్పాడు మేనేజర్.

విశ్వనాథ్ పక్క సీటులో వచ్చి కూర్చుంది గాయత్రి.

అతని సూచనల మేరకు పనిచేయడం ప్రారంభించింది. వర్క్‌లో ఆ అమ్మాయి చురుకుదనం, గ్రహణశక్తి చూసి సంతోషించాడు.

కొద్దిసేపయ్యాక ఆమె ఎవరో గుర్తొచ్చిందతనికి. గాయత్రి ఎవరో జ్ఞాపకం వచ్చాక అతని ముఖంలో చిరునవ్వు తొంగి చూసింది.

కస్టమర్స్ రద్దీ తగ్గి రెండు నిముషాలు ఖాళీ దొరికింది.

"సంగీతం ఇప్పటికీ ప్రాక్టీస్ చేస్తున్నారా?" అడిగాడు హఠాత్తుగా.

సంభ్రమంగా చూసింది అతని వైపు.

"నాకు సంగీతం వచ్చని మీకెలా తెలుసు?"

ఆమె మాటలకు నవ్వాడు.

"దాదాపు 5 సంవత్సరాల క్రితం దూరదర్శన్‌లో ప్రసారమైన 'స్వరలహరి' అనే కార్యక్రమంలో మనం పార్టిసిపేట్ చేశాం. గుర్తుందా?"

అతని ముఖంలో చిరునవ్వు అలాగే నిలిచి ఉంది.

ఆశ్చర్యంగా అతని వైపు చూసింది.

కొద్ది క్షణాల తర్వాత ఆమె వదనంపై మందహాసం మెరిసింది.

"గుర్తొచ్చింది. ఫస్ట్ ప్రైజ్ గెలుచుకున్న విశ్వనాథ్‌గారు మీరే కదూ?"

అవునన్నట్లుగా తలూపాడు.

"ఇప్పుడు మీరు చెప్పేవరకు నేను మిమ్మల్ని గుర్తించలేదు. అయామ్ సారీ!" అంది.

"నేను కూడా మిమ్మల్ని వెంటనే గుర్తు పట్టలేకపోయాను. సంగీతం ప్రాక్టీస్ చేస్తున్నారా?" అడిగాడు మళ్ళీ.

"సంగీతం నా నిత్యజీవితంలో భాగం. ఎట్టి పరిస్థితుల్లోనూ సంగీత సాధన మానుకోను. ఒక్క రోజు సాధన చేయకపోయినా మనసుకు వెలితిగా అనిపిస్తుంది. ఓ గంటసేపు గొంతెత్తి పాడుకుంటేగాని మనసులో వెలితి తీరదు" ఆమె కంఠంలో సంగీతం పట్ల అపరిమితమైన ఆరాధన, ఇష్టం వ్యక్తమవుతున్నాయి.

ముచ్చటగా అనిపించిందతనికి.

ఇరవై రోజులు గడిచాయి.

"గాయత్రిగారూ! మీ ఇంటి ఫోన్ నెంబర్ చెబుతారా?" అదిగాడు విశ్వనాథ్.

"ఎందుకు?" ఆశ్చర్యంగా అడిగింది.

అటెండెన్స్ రిజిస్టర్‌లో చివరి పేజీ చూపించాడు.

"ఎప్పుడైనా అవసరమైతే మాట్లాడడానికి వీలుగా ఉంటుందని మన స్టాఫ్ రెసిడెన్షియల్ ఫోన్ నంబర్లు ఇందులో రాసి ఉంచుతాము. మీ ఫోన్ నంబరు చెప్పండి" ఆమె పేరు రాస్తూ అన్నాడు.

నంబర్ చెప్పింది.

రిజిస్టర్‌లో నోట్ చేస్తూ మనసులో గుర్తు పెట్టుకున్నాడు.

ఆ రోజు రాత్రి 8 గంటలకు తల్లిదండ్రులతో మాట్లాడడానికి స్వగ్రామానికి ఫోన్ చేశాడు.

"హలో!" అవతలి నుండి అతని తాతయ్య స్వరం వినిపించింది.

"తాతయ్యా" సంతోషంగా అన్నాడు విశ్వనాథ్.

"ఎలా ఉన్నావు చిన్నా?" ఆప్యాయంగా పలకరించాడాయన మనవడిని.

"బావున్నాను తాతయ్యా!"

"నీ కోసం ఓ చక్కని అమ్మాయిని చూశాం. నువ్వు వీలు చూసుకొని వచ్చి అమ్మాయిని చూసి ఓ.కె. అంటే ముహూర్తాలు పెట్టుకోవచ్చు."

"తాతయ్యా! గాయత్రి అనే ఆమె మా బ్యాంక్‌లో మొన్నామధ్య కొత్తగా ఉద్యోగంలో చేరింది. ఆమెను పెళ్ళి చేసుకోవాలని నా మనసులో ఎంతో ఆశగా ఉంది. కానీ ఈ విషయం గురించి ఆమెను అడగాలంటే మొహమాటంగా ఉంది. అందుకని అడగలేకపోతున్నాను తాతయ్యా!"

"అడిగి చూడు చిన్నా! ఇందులో తప్పేమీ లేదు. ఆ అమ్మాయి ఎలా ఉంటుందో చెప్పు"

విశ్వనాథ్‌కు ఉత్సాహం వచ్చింది.

"5 యేళ్ళ క్రితం దూరదర్శన్‌లో ప్రసారమైన

'స్వరలహరి' అనే కార్యక్రమంలో నాకు ఫస్ట్ ప్రైజ్ వచ్చింది గుర్తుందా?"

"గుర్తుంది. ఆ ప్రోగ్రామ్ వీడియో క్యాసెట్ కూడా మన దగ్గర ఉంది."

"ఆ పోటీలో సెకండ్ ప్రైజ్ గెలుచుకున్న గాయత్రి గురించే ఇప్పుడు చెప్పాను."

"సంగీతం పోటీలో బహుమతి గెలుచుకుందని చెప్పావు కాబట్టి గాయత్రి నీ అభిరుచికి తగిన అమ్మాయి. చక్కటి పేరు. ఆలస్యం చేయకుండా వెంటనే తన అభిప్రాయం తెలుసుకో. నువ్వు ఇష్ట పడిన గాయత్రి నీకు భార్యగా లభించాలని మన స్ఫూర్తిగా ఆశీర్వదిస్తున్నాను."

"థాంక్యూ తాతయ్యా!"

"మీ అమ్మ, నాన్న ఫంక్షన్‌కు వెళ్ళారు. ఓ గంటలో తిరిగి వస్తారు. వాళ్ళు వచ్చేలోగా నేను వీడియో క్యాసెట్ పెట్టుకుని చూస్తాను. ఆ తర్వాత వాళ్ళకు కూడా చూపిస్తాను. నీకు కాబోయే భార్యను కొద్దిసేపట్లో మేము ఇక్కడే కూర్చుని చూడబోతున్నామన్న మాట. ఆ అమ్మాయి ఒప్పు కుంటే ఇక పెళ్ళి చూపులు కూడా అవసరం లేదు" సంతోషంగా ఫోన్ పెట్టేశాడాయన.

తాతయ్య మాటలతో విశ్వనాథ్‌కు ధైర్యం వచ్చింది.

మొహమాటాన్ని విడనాడి వెంటనే ఆమెకు ఫోన్ చేశాడు.

"గాయత్రిగారూ! విశ్వనాథ్‌ను మాట్లాడుతున్నాను."

"చెప్పండి సార్" ఆమె గొంతులో ఆశ్చర్యం ధ్వనించింది.

"మీకు పెద్దవాళ్ళు ఏమైనా పెళ్ళి సంబంధాలు చూస్తున్నారా?" డైరెక్ట్‌గా విషయంలోకి వచ్చాడు.

అతని ప్రశ్న ఆమెకు ఇబ్బందిగా అనిపించింది. కొద్ది క్షణాలు మౌనంగా ఊరుకుంది.

విశ్వనాథ్‌కు టెన్షన్‌గా ఉంది. ఆమె జవాబు కోసం ఎదురు చూస్తున్నాడు.

"చూస్తున్నారు, ఇంకా సెటిల్ కాలేదు" నిమిషం తర్వాత జవాబు చెప్పిందామె.

"మిమ్మల్ని పెళ్ళి చేసుకోవాలని నాకు మనసులో ఆశగా ఉంది. ఈ విషయం పెద్దవాళ్ళకు ముందుగా చెబితే బాగుంటుందని ఇంటికి ఫోన్ చేశాను. తాతయ్య ఓ.కే. అన్నారు. తాతయ్య మాట మా ఇంట్లో అందరికీ వేదవాక్కు. నా ప్రపోజల్ మీకు ఇష్టమైతే మీ పేరెంట్స్‌తో చెప్పండి. ఇష్టం లేకపోతే నాతో చెప్పండి. ఇంకెప్పుడూ ఈ విషయం ప్రస్తావించి మిమ్మల్ని బాధ పెట్టను."

జవాబు చెప్పకుండా నిశ్శబ్దంగా ఉండిపోయింది.

"ఉంటాను" ఆమె ఇబ్బందిగా ఫీలవుతుందని గ్రహించి ఫోన్ పెట్టేశాడు.

చాలాసేపు ఆలోచిస్తూ కూర్చుండి పోయిందామె.

గంట తర్వాత తల్లికి ఫోన్ చేసింది.

మర్నాడు ఉదయానికి ఆమె తల్లిదండ్రులు వచ్చారు.



## ఆఫర్లే ఆఫర్లు!

క్యారెక్టర్ ఎక్కువగా లేకపోయినా రజనీకాంత్ నటించిన హిట్ చిత్రంలో ఓ హీరోయిన్‌గా కనిపించిన నయనతారకి తెలుగులో కుప్పలు తెప్పలుగా ఆఫర్లు వచ్చిపడుతున్నాయట. 15 చిత్రాలకు పైగా ఆఫర్లు వచ్చినట్లు వినికిడి. ముద్దుగా బొద్దుగా కనిపించే ఈ అమ్మడికి తెలుగుతో పాటు తమిళ, మలయాళం, కన్నడ భాషల్లో కూడా ఒక్కసారిగా డిమాండ్ పెరిగిపోయింది. టర్కీ నాన్‌వెజ్ వంటకాలంటే ప్రాణం అని చెప్పే ఈ అమ్మడు ఇప్పటి వరకూ తమిళంలో పె(వృ)ద్ధ హీరోల సరసనే నటించింది. అయితే కుర్ర హీరోలు తమ ప్రక్కన హీరోయిన్‌గా తీసుకోవడానికి అంతగా ఇష్టపడడం లేదట. అదే విషయం అమ్మడి వద్ద కదిపితే 'నేను కొంచెం భారీ కాయం కదా! అందుకేనేమో! అయితే త్వరలో కుర్ర హీరోలతో కూడా కనిపించబోతున్నాను' అంటూ ఆనందాన్ని వెలిబుచ్చింది.

విశ్వనాథ్‌తో మాట్లాడి సంతృప్తి చెంది అతని తండ్రి చిరునామా అడిగి తీసుకున్నారు.

వారం గడిచింది.

ఒక రోజు సెలవు పెట్టి ఊరికి వెళ్ళి వచ్చాడు విశ్వనాథ్.

మర్నాడు తన సీటులో కూర్చుని పనిచేసుకుంటున్న విశ్వనాథ్‌ను తోటి ఆఫీసర్ పలకరించాడు.

"సెలవుపెట్టి ఊరికి వెళ్లి వచ్చావు. ఏమిటి సంగతి? పెళ్ళెప్పుడు?" హాస్యంగా అడిగాడాయన.

"ఈ నెల 28న" చెప్పాడు విశ్వనాథ్.

"నిజంగానా?" ఆశ్చర్యపోయాడాయన.

త్వరలోనే విశ్వనాథ్ పెళ్ళి అన్న సంగతి స్టాఫ్‌లో చాలామందికి తెలిసింది మరికొద్ది సేపట్లో.

సెలవు పెట్టి తల్లిదండ్రుల వద్దకు వెళ్ళి వచ్చిన గాయత్రిని పరిశీలనగా చూసింది పక్క సీటులో పనిచేస్తున్న శోభ.

ఎర్రగా పండిన గోరింటాకుతో గాయత్రి చేతులు మరింత అందంగా కనబడుతున్నాయి. ఉంగరం వేలికి కళ్యాణపు ఉంగరం చక్కగా అమరింది.

"పెళ్ళెప్పుడుగాయత్రీ?" అడిగిందామె నవ్వుతూ.

"ఈ నెల 28న. అనుకోకుండా కుదిరింది" చెప్పింది గాయత్రి.

"నీది లక్కీ హేండ్ గాయత్రీ! చదువు పూర్తయిన వెంటనే ఉద్యోగం వచ్చింది. ఉద్యోగంలో చేరిన వెంటనే పెళ్ళి కుదిరింది" అభినందించింది శోభ.

"విశ్వనాథ్ పెళ్ళి కూడా ఈ నెల 28నే జరుగుతుంది. మేము ఎవరి పెళ్ళికి రావాలి?"

మనసులో అనుమానం స్ఫురించగా నవ్వుతూ గాయత్రి వైపు చూసింది శోభ.

ఒకింత సిగ్గుపడుతూ తల దించుకుంది గాయత్రి.

"పెళ్ళికొడుకు ఏం చేస్తాడు?"

"ఈ ఊళ్ళోనే బ్యాంక్‌లో ఉద్యోగం"

"అర్థమైంది. పెళ్ళికొడుకు విశ్వనాథ్ కదూ? లవ్ మేరేజ్ అన్నమాట" నవ్విందామె.

తల అడ్డంగా ఊపింది గాయత్రి.

"మాది లవ్ మేరేజ్ కాదు. అతను ప్రపోజ్ చేస్తే మా నాన్నగారికి ఈ సంగతి చెప్పాను. అంతకు మించి ఈ విషయంలో మేమిద్దరం ఏమీ మాట్లాడుకోలేదు."

విశ్వనాథ్‌కు, గాయత్రికి పెళ్ళి అని మరు నిముషంలో అందరికీ తెలిసిపోయింది. ఇద్దరినీ అభినందించారు సహోద్యోగులు.

బ్యాంక్‌లో గాయత్రితో చనువుగా మాట్లాడాలనిపించినా ఒకింత మొహమాటం వల్ల మాట్లాడలేకపోతున్నాడు తను. ఆమె పరిస్థితి కూడా అలాగే ఉంది.

"రేపు సినిమాకు వెళదామా గాయత్రీ?" శనివారం మధ్యాహ్నం ధైర్యం చేసి ఆమె సీటు దగ్గరకు వెళ్ళి నెమ్మదిగా అడిగాడు.

"సారీ నేను రాను" కంప్యూటర్ వైపు చూస్తూ జవాబు చెప్పింది.

పెళ్ళి వైభవంగా జరిగింది. నచ్చిన అమ్మాయిని పెళ్ళి చేసుకున్నందుకు విశ్వనాథ్‌కు మనసులో సంతోషంగా ఉంది.

నాలుగు రోజులు గడిచాయి.

సెలవులు లేకపోవడంతో గాయత్రి ప్రయాణానికి సిద్ధమైంది. పెద్దలు అడ్డు చెప్పలేకపోయారు.

ఇద్దరినీ సంతోషంగా సాగనంపారు వారు.

అతనితో కలిసి ప్రయాణించడం ఆమెకు కొత్తగా, హాయిగా ఉంది. అతనికి కూడా అదే ఫీలింగ్. రాత్రి ప్రయాణం.


ఉదయానికి అతని క్వార్టర్స్‌కు చేరుకున్నారు.

పొందికగా సర్ది ఉంది ఇల్లు. మగవాళ్ళ

*(మిగతా 46వ పేజీలో చూడండి)*



# డ్రైవర్లకూ ప్రావిడెంట్ ఫండ్ ఉండాలి




బీఎఎస్ఎఫ్ ఇండియా లిమిటెడ్ అనే కంపెనీలో పనిచేస్తున్న మేనేజర్స్ క్రింద పనిచేస్తున్న కారు డ్రైవర్లు, ఆ కంపెనీలో పనిచేసేవారా కాదా, అట్లాగయితే వారికి ప్రావిడెంట్ ఫండ్, కంపెనీ కట్టాలా అనే విషయం ఈ తీర్పులోని ముఖ్య విషయం. ఈ కంపెనీలో పనిచేస్తున్న 21 మంది మేనేజర్లకు 21 మంది డ్రైవర్లు వున్నారు. వీరందరూ అంటే డ్రైవర్లు కంపెనీ మేనేజర్ల కార్లు నడుపుతున్నారు. డ్రైవర్లపై అజమాయిషీ మేనేజర్లదేనట. మేనేజర్లను ఇంటి నుండి ఆఫీసుకు తీసుకొని వెళ్ళడం, తిరిగి తీసుకు రావటం, ఆఫీసు పనిమీద బైటికి తీసుకుని వెళ్ళటమూ మొదలైన విధులు చేయటమూ డ్రైవర్ల పనిట. డ్రైవర్లకు వారి సర్వీసు కాలాన్ని బట్టి జీతము (వేజెస్) ఇస్తుంటారుట. ఈ జీతం కంపెనీ యిస్తుందిట. అంతే కాకుండా ఓవర్ టైం, యూనిఫాం, చలి కాలపు దుస్తులు, బూట్లు యిస్తుంటారుట. వీటిని కంపెనీ యిస్తుందిట. కానీ వీరు కంపెనీ మేనేజర్ల అజమాయిషీలోనే పనిచేస్తుంటారుట. వీరి పని తీరుపై మొత్తం అధికారం మేనేజర్లదేనట. కార్లు కంపెనీ యిస్తుందిట. అయినప్పటికీ ఈ డ్రైవర్లు కంపెనీలో పనివారు కాదు. అందుచే వీరికి ప్రావిడెంట్ ఫండ్ కట్టనవసరం లేదు అనేది కంపెనీ వాదన.

డ్రైవర్లను, మేనేజర్లే నియమించుకుంటారు. వారిపై పూర్తి పెత్తనం మేనేజర్లదే. కంపెనీ కేవలం డ్రైవర్ల ఖర్చు మాత్రమే మేనేజర్లకు యిస్తుంది. కనుక వీరిని కంపెనీ యజమానులు నియమించినట్లు అవదు. వీరి గురించి మాకెట్టి బాధ్యత లేదు. కనుక పిఎఫ్ కట్టనవసరం లేదు అనే వాదనను బాంబే హైకోర్టులోని సింగిల్ జడ్జి అంగీకరించలేదు. ఆ జడ్జిగారు పిఎఫ్ కమీషనర్ ఉత్తరువు (డ్రైవర్లు కంపెనీ ఎంప్లాయిస్‌గానే భావించాలి. వారికి పిఎఫ్ కట్టాలి అనే ఉత్తురువు) సరైనది, చట్టబద్ధమైనదే అని తీర్పు యిచ్చారు. ఈ జడ్జిగారి తీర్పుపై ఆ కంపెనీ అపీలు వేయగా ఇద్దరు జడ్జీల బెంచి కంపెనీ పిఎఫ్ కట్టాలి అనే తీర్పు యిచ్చింది. అంటే పిఎఫ్ కమీషన్ యిచ్చిన ఉత్తరువు, సింగిల్ జడ్జి యిచ్చిన తీర్పు చట్టబద్ధమైనవేనని అర్థం. దీనిని బట్టి డ్రైవర్లకు పిఎఫ్ కట్టాలి అని అర్థమవుతుంది.

డ్రైవర్లకు వేజెస్, కంపెనీ డైరెక్ట్‌గా యిస్తుందా, ఇన్‌డైరెక్ట్‌గా యిస్తుందా అనేది ఏమయినప్పటికీ, డ్రైవర్లకు యిచ్చేది వారు కంపెనీ పని కొరకు. కంపెనీ కారు నడుపుతున్నందుకే. కనుక, డ్రైవర్లు సె.2 వివరణ ప్రకారం డ్రైవర్లే అన్నది బొంబాయి హైకోర్టు తీర్పు. హైకోర్టు తన తీర్పులో అనేక సుప్రీమ్ కోర్టు తీర్పులను పరిశీలించింది. సంస్థకు సంబంధించిన పని చేస్తున్నారా లేదా అనేది ముఖ్యం. ఎవరి అధీనంలో (కంట్రోలు) పని చేస్తున్నారు అనేది అంత ముఖ్యం కాదు.

ఈ తీర్పువల్ల ఆ కంపెనీ డ్రైవర్లు కూడా పిఎఫ్‌కు అర్హులేనని తేలింది. పూర్తి వివరాలు కావాలంటే చూడండి లేబర్ లా జర్నల్ రెండవ భాగం పేజీ 500. ●

## సాధన కథ

(7వ పేజీ తరువాయి)

కూడా ఇంత నీట్‌గా ఇల్లు సర్దుకుంటారా? మనసులో ఆశ్చర్యపోయింది.

స్నానం చేశాక ప్రయాణపు బడలిక తీరింది.

వంట చేయడంలో ఆమెకు సహాయం చేశాడు విశ్వనాథ్.

పెళ్ళి ఇద్దరు వ్యక్తులను ఇంత సన్నిహితం చేస్తుందా? గాయత్రి తనలో తాను ఆశ్చర్యపోతోంది.

తమ వివాహం నిశ్చయమైన తర్వాత విశ్వనాథ్ సినిమాకు వెళదామని కోరడం, తాను తిరస్కరించడం గుర్తొచ్చింది.

"మీరు సినిమాకు రమ్మన్నప్పుడు నేను రానన్నాను కదా! ఆ రోజు మిమ్మల్ని బాధపెట్టినట్లయితే సారీ" అంది భోజనమయ్యాక డైనింగ్ టేబుల్ శుభ్రం చేస్తూ.

నవ్వుతూ ఆమె వైపు చూశాడు విశ్వనాథ్.

"మన పెళ్ళి అప్పటికి ఇంకా జరగలేదు కాబట్టి మీతో కలిసి తిరగడం తప్పు అనే ఫీలింగ్ నాలో ఉండడంవల్ల ఆ రోజు అలా జవాబు చెప్పాను. ఇంకెప్పుడూ అలా ప్రవర్తించను" అంది.

బ్యాంక్‌కు వెళ్ళడానికి రెడీ అయి బైక్ మీద అతని వెనుక కూర్చుంది గాయత్రి.

కలిసి బైక్ మీద వెళ్ళడం అదే ప్రథమం వారికి. థ్రిల్లింగ్‌గా అనిపించింది ఇద్దరికీ.

ఆమె పనిచేస్తున్న బ్రాంచ్ ముందు డ్రాప్ చేసి తాను చేస్తున్న జోనల్ ఆఫీస్‌కు వెళ్ళాడతను. పెళ్ళికి వారం రోజుల ముందే అతనికి ట్రాన్స్‌ఫర్ ఆర్డర్ అందింది.

సాయంత్రం త్వరగా ఇంటికి వెళ్ళి ఆమెతో గడపాలనిపించిందతనికి. కాని పనిలో నిమగ్నమైతే టైమ్ తెలియలేదు.

రాత్రి 7 గంటలకు ఇంటికి చేరుకున్నాడు. ఆఫీసర్ హోదాలో ఉండడంవల్ల వృత్తి రీత్యా బాధ్యతలు ఎక్కువగా ఉంటాయతనికి.

విశ్వనాథ్ ఇంటికి వచ్చేటప్పటికి వంట పూర్తిచేసి స్నానం చేసిందామె.

మరో గంటలో భోజనాలు పూర్తయ్యాయి.

తాను తెచ్చిన మల్లెపూల దండను ఇష్టంగా ఆమె చేతికందించాడు.

తెల్లవారుఝామున 4 గంటలకు మెలకువ వచ్చిందతనికి. "గాయత్రీ" ఆమె వంటిపై దుప్పటి సరిచేస్తూ సున్నితంగా తట్టి లేపాడు.

కళ్ళు తెరిచింది.

"నిద్ర సరిపోయిందా?" అడిగాడు.

"సరిపోలేదు. అయినా లేస్తాను" అంది.

మరో గంటలో స్నానాధికాలు పూర్తి చేసుకుని పూజాపీఠం ముందు కూర్చున్నారు. దీపం దేదీప్యమానంగా వెలుగుతోంది.

తల తిప్పి అతని వైపు చూసింది.

"సంగీతంలో మీరు నా కంటే ఎంతో ఉన్నత స్థాయిలో ఉన్నారు. మీతో కలిసి నేను సాధన చేయడమా? ఆశ్చర్యంగా ఉంది. ఇందుకు నేను తగను కదూ?" అంది.

"అలా అనుకోవద్దు" మృదువుగా ఆమె చేయి నొక్కాడు. "సంగీతంలో అందరం నిరంతర విద్యార్థులమే. నా దగ్గర నువ్వు తెలుసుకోవలసిన విషయాలుంటాయి. నీ దగ్గర నేను నేర్చుకోవలసినవి ఉంటాయి."

చేతులు జోడించి ఎదుట ఉన్న త్యాగరాజ స్వామి పటానికి భక్తితో నమస్కరించారు ఇద్దరూ.

మరు నిముషంలో సంగీత సాధన మొదలైంది.

గంటన్నర సేపు స్వరార్చన చేసి అద్భుతమైన అనుభూతితో పూజాపీఠం ముందు నుండి లేచారు.

పాలు త్రాగి వంటపని ప్రారంభించారు.

అతను అందించిన కూరగాయ ముక్కలు బాణలిలో వేసి మూత పెట్టి బెడ్‌రూమ్‌లోకి వెళ్ళి డ్రస్సింగ్ టేబుల్ సర్దుతోంది.

ఆమెకు సహాయం చేస్తూ నడుం మీద చేయి వేసి దగ్గరకు లాక్కున్నాడు విశ్వనాథ్.

"రాత్రి శృంగార సాధనలోనూ, తెల్లవారుఝామున సంగీత సాధనలోనూ నీ సహకారానికి థాంక్స్" అతని కళ్ళలో సంతోషం స్పష్టంగా తెలుస్తోంది.

"సంగీతంలో మనం ఇంకా ఉన్నతస్థాయికి చేరుకోవాలని నా కోరిక" తృప్తిగా భర్త ముఖంలోకి చూస్తూ అందామె.

"నా కోరిక కూడా అదే"

జారుతున్న గాయత్రి చీర కొంగు చప్పున సరిచేశాడు. ●